క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న ఆప్తాలమిక్ మౌనిక

గజపతినగరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో శంకర్ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన ఆప్తాలమిక్ జి.మౌనిక సేవలందించారు. 69 మందికి కంటి పరీక్షలు చేసి 37 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆస్ప త్రికి తరలించి శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు క్యాంప్ కో–ఆర్డినేటర్ వెంకటరమణ తెలిపారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి రేవంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా మొక్కలు



రైతులకు రాయితీపై ఇచ్చేందుకు సిద్ధం చేసిన మొక్కలు

శృంగవరపుకోట: ఉద్యానవనశాఖ నుంచి రాయితీపై రైతులకు కొబ్బరి, మామిడి, జీడి మామిడి మొక్కలు పంపిణీ చేయనున్నట్లు స్థానిక జియో(గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్) వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ తెలిపారు. పెదఖండేపల్లి రహదారిలో ఉన్న జియో కార్యాలయంలో రైతులు సంప్రదించవచ్చని చెప్పారు. కొంతమంది రైతులకు సోమవారం మొక్కలు అందచేశారు. మొక్కలు అవసరమైన వారు 93911 38665 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వృద్ధాశ్రమానికి విరాళం



ఆశ్రమ నిర్వాహకుడికి నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లిలోని బాపూజీ వృద్ధాశ్రమానికి పట్టణంలోని గొల్లవీధికి చెందిన సూరంపల్లి జగదాంబ కుటుంబ సభ్యులు రూ.10వేల విరాళం అందజేశారు. సూరంపల్లి వెంకట అప్పలనరసింహమూర్తి వర్ధంతి నేపథ్యంలో ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమానికి ఆశ్రమ నిర్వాహకుడు కోట్ల లక్ష్మణరావుకు సామవారం నగదు అందజేశారు. దాత కుటుంబ సభ్యులు రౌతు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చేయూత నగదు జమ చేయాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దమరసింగి గ్రామ మహిళలు

గుర్ల: మండలంలోని దమరసింగి గ్రామ మహిళలు తమకు వైఎస్సార్ చేయూత పథకానికి సంబంధించిన నగదు జమ చేయాలని అధికారు లను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఈఓపీఆర్డీ గాయత్రి, మండల పరిషత్ కార్యాలయ ఏఓ వరప్రసాద్‌కు 50 మంది మహిళలు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 30 మంది మహిళల ఖాతాల్లోనే చేయూత నగదు జమయ్యిందని, మిగిలిన వారికి జమచేయాలని వినతిపత్రంలో పెర్కొన్నారు.


మాజీ ఎంపీటీసీ మృతి



సూరిబాబు(ఫైల్)

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు లచ్చిరెడ్డి సూరిబాబు అనారో గ్యంతో సోమవారం ఉదయం తన స్వగ్రామంలో మృతి చెందారు. ఈయన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ ఎంపీటీసీగా పనిచేశారు. తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరి పార్టీకి సేవలందించారు. ఆయన మృతిపై మండల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

పాలసంఘం అధ్యక్షుడిగా ఈశ్వరరావు



ఈశ్వరరావు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో విశాఖడెయిరీ పాలసంఘం అధ్యక్షుడిగా దేగల ఈశ్వరరావు ఎన్నికయ్యారని, డెయిరీ సూపర్‌వైజర్ నాయుడు తెలిపారు. పాల సంఘం అధ్యక్ష పదవికి సోమవారం ఎన్నిక నిర్వహించారు.సభ్యులు ఈశ్వరరావు, బొడ్డు శ్రీను బరిలో నిలిచారు. 149 మంది సభ్యులు ఉండగా 77 ఓట్లు ఈశ్వరరావుకు, బోడ్డు శ్రీనుకు 71 ఓట్లు వచ్చాయి. ఒక సభ్యుడు ఓటు వేయలేదు. ఆరు ఓట్ల మెజార్టీతో ఈశ్వరరావు విజయం సాధించారు.

ఊదరగొట్టారు... ఊరుకున్నారు

- 20లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగభృతి, జాబ్ క్యాలెండర్ అంటూ ఎన్నికల వేల యువతకు కూటమి ఎర
- ప్రభుత్వం ఏర్పడి నెలదాటుతున్నా నిరుద్యోగ భృతి ఊసే లేదు
- హామీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న నిరుద్యోగులు



కూటమి ఎన్నికల మేనిఫెస్టో

శృంగవరపుకోట: తాము అధికారంలోకి వస్తే ఏటా నాలుగు లక్షలు చొప్పున అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని.. నిరుద్యోగులకు నెలకు రూ.3వేల నిరుద్యోగభృతి ఇస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, లోకేష్‌తో పాటు కూటమి నాయకులు ఊరూరా సభలు పెట్టి మైకుల్లో ఊదర గొట్టారు. సూపర్ సిక్స్ హామీలంటూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఓటర్లను ఆకర్షించేందుకు ఒక్కో వర్గానికి ఒక్కో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల కల్పనకు తొలిప్రాధాన్యత ఇస్తామని, నిరుద్యోగభృతి అందేలా చేస్తామని యువగళం సభల్లోనూ లోకేష్ పదే పదే చెప్పారు. ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు సర్కారు కొలువుదీరి నెలరోజులు గడిచిపోయింది. ఇంకా నిరుద్యోగభృతి హామీ అమలకు సంబంధించి ప్రభుత్వం ఏ ప్రకటనా చేయలేదు. పథకానికి సంబంధించిన విధి విధానాలు రూపొందించేదెప్పుడు..? అమలు చేసేది ఎప్పుడని నిరుద్యోగ యువత ప్రశ్నిస్తున్నారు. 2014లో ఇంటికో ఉద్యోగం, రూ.2 వేల నిరుద్యోగ భృతి అంటూ చెప్పి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చారని, ఆ హామీలను గాలికి వదిలేసి నిలువునా ముంచేశారని, మళ్లీ బాబు అండ్ కో అదే విధంగా మోసం చేస్తారేమోనని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నిరుద్యోగభృతి ఇస్తే తమ కష్టాలు తీరుతాయని, పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి ఫీజులు, కోచింగ్, మెటీరియల్ కొనుగోలు వంటి అవసరాలు తీరుతాయని నిరుద్యోగులు ఆశ పడుతున్నారు. శృంగవరపుకోట నియోజకవర్గం పరిధిలోని ఎస్.కోట మండలంలో 19,622, కొత్తవలస మండలంలో 17, 473, లక్కవరపుకోట మండలంలో 13,709, జామి మండలం లో 9,876, వేపాడ మండలంలో 12,720 మొత్తంగా 73,400 కుటుంబాలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఆయా కుటుంబాల్లో వేలాది మంది నిరుద్యోగ యువత ప్రభుత్వం నిరుద్యోగభృతిపై చేసే ప్రకటన కోసం ఎదురు చూస్తోంది. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, డిగ్రీ, డిప్లమా వంటి ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువత, నిరుద్యోగులు ఉద్యోగ వయోపరిమితి దాటిపోతుండడంతో వీళ్లంతా క్రమం తప్పకుండా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరుతున్నారు.

తక్షణం అమలు చేయాలి



నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణం అమలు చేయాలి. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. పాత నోటిఫికేషన్లు తక్షణం పూర్తి చేయాలి. నాడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చినమాట ప్రకారం నిరుద్యోగులు అందరికీ భృతి కల్పించాలి. మార్గదర్శకాల పేరుతో నిరుద్యోగులకు వాతలు, కోతలు వేయకూడదు. ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఖచ్చితంగా అందేలా చర్యలు తీసుకోవాలి.

– వి.సతీష్, నిరుద్యోగి, అమ్మపాలెం, ఎస్.కోట మండలం

ఎప్పుడు ప్రకటిస్తారో చెప్పాలి



తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ నన్ను డిప్లమా వరకు చదివించారు. ఉద్యోగ, ఉపాధి లేకపోవడంతో తల్లిదండ్రులకు వ్యవసాయంలో సహాయపడుతున్నాను. కూటమి నాయకులు ఎన్నికల హామీలో నిరుద్యోగులందరికీ నిరుద్యోగభృతి ఇస్తామని, ఏటా 4లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. మాలాంటి నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని నిరుద్యోగభృతి పథకం అమలు చేయాలి. పథకం ఎప్పుడు అమలు చేస్తారో ప్రకటన చేయాలి. అలాగే ఇచ్చిన మాట ప్రకారం ఏటా నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించాలి. – ఏడువాక రామ్‌ప్రసాద్, బొద్దాం, వేపాడ మండలం

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాను. తండ్రి చనిపోయాడు, చెల్లి ఉంది. కుటుంబానికి అండగా నిలవాల్సిన నేను ఉద్యోగం లేకపోవడంతో తల్లిపై ఆధారపడాల్సి వస్తోంది. కొంచెం భూమి ఉంది, వ్యవసాయ పనులు చేస్తున్నాను. చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి. అలాగే నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి.

– జాగారపు పార్థసారథి, పి.కె.ఆర్.పురం వేపాడ మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు తక్షణం నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే. నేను డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగాల నోటిఫికేషన్‌ల కోసం ఎదురు చూస్తున్నాను. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. నిరుద్యోగ భృతి అమలు తేదీని, జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలి. కూటమి హామీలపై యువత గంపెడాశలతో ఎదురు చూస్తోంది.

– రాయిపల్లి సత్తిబాబు, తామరాపల్లి, ఎల్.కోట మండలం

రైతుల పేరున భూరికార్డులు మార్చండి



తహసీల్దార్ సుదర్శన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కె.కృష్ణాపురం రైతులు

దత్తిరాజేరు: తాము సాగుచేస్తున్న భూములు తమ పేరున కాకుండా కోరప గ్రామకంఠం, డీపట్టాలు, గయాల భూములుగా రికార్డుల్లో ఉన్నాయని, వాటిని తమపేరును మార్చాలని కోరప కృష్ణాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శన్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు కర్రి రామకృష్ణ, ధన్నాన రామ్మూర్తి, ఆదినారాయణ, నర్సింహులు తదితరులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ కుటుంబాలు సాగు చేసుకుంటున్న సుమారు 150 ఎకరాల భూములు ప్రభుత్వ రికార్డుల్లో రైతుల పేరున కాకుండా కోరప గ్రామం పేరున ఉండడంతో అన్ని విధాలా నష్టపోతున్నామని వాపోయారు. తహసీల్దార్ స్పందిస్తూ వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

గజపతినగరం: జిల్లాలో దేవదాయ,ధర్మాదాయ భూములను సాగుచేస్తున్న కౌలు రైతుల సమస్యలను ప్రభు త్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తొత్తడి పైడిపునాయుడు, రాకోటి రాములు కోరారు. కౌలు రైతుల సమస్యలపై ముద్రించిన కరపత్రాలను మండల కేంద్రంలో సోమవా రం వారు ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చాలామంది కౌలు రైతులకు కౌలు కార్డులు అందకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పెట్టుబడి సాయం, బ్యాంకు రుణాలు, బీమా పరిహారం , రాయితీలపై విత్తనా లు, ఎరువులు అందడం లేదన్నారు. గతంలో సాగుదారులు నుంచి ఎండోమెంట్ అధికారులు మూడేళ్లకొకసారి కౌలు సాగు ధర పెంచి అదే రైతును కొనసాగించేవారని, ఈమధ్య కాలంలో బహిరంగ వేలంపాట నిర్వహించి ఎవరు ఎక్కువ ధరకు పాడితే వారికే కౌలు నిర్ణయిస్తున్నారని, ఈవిధానం వల్ల అనేక మంది సన్న,చిన్నకారు, రైతులు నష్టపోతున్నారని చెప్పారు. బహిరంగ వేలం వేయకుండా 13 శాతం కౌలు పెంచి చిన్న, సన్న కారు రైతులకే కౌలు కొనసాగించాలని గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన మినహాయింపును ప్రభుత్వాలు పక్కన పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం,ఎండోమెంట్ అధికారులు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు టి.సోములు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ



పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్టు మనోజ్ కుమార్

గజపతినగరం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రత్యేక అవసరాల పిల్లలకు స్థానిక భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్టు మజ్జి మనోజ్ సోమవారం ఫిజియోథెరఫీ సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రానికి తీసుకువచ్చి ఫిజియోథెరపీ సేవలు అందేలా చూడాలన్నారు. ఐఈఆర్టీలు శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్ కోసం 1912కి కాల్ చేయండి

సాక్షి, విశాఖపట్నం: కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావల్సిన రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని వివిధ మీ–సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈకార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందుకే రైతులు నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.రైతులు ఆధార్ నంబర్, రిజిస్టర్డ్ ఫోన్ నంబర్, పట్టాదార్ పాస్‌బుక్ , సర్వే నంబర్లు, వాల్టా సర్టిఫికెట్ నంబర్, కులధ్రువీకరణ పత్రం వంటి వివరాలను తెలియజేయాలన్నారు. విద్యుత్ కనెక్షన్ కావలసిన శ్రీకాకుళం,విజయనగరం,విశాఖపట్నం,రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధి వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

భోగాపురం: మండలంలోని సవరవిల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది.అంగన్‌వాడీ కార్యకర్త శాంతకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అంగన్‌వాడీ కేంద్రం తలుపుల గొళ్లాన్ని తప్పించి టేబుల్ ఫ్యాన్, గ్యాస్ సిలిండర్‌తో పాటు 261 గుడ్లను దొంగిలించుకుపోయారు. ఆదివారం సెలవు కావడంతో కేంద్రం తెరవలేదు. సోమవారం ఉదయం కేంద్రాన్ని తెరిచి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, మహిళా పోలీస్ త్రివేణికి సమాచారం అందించినట్లు కార్యకర్త శాంతకుమారి తెలిపారు. ఇదిలా ఉంటే దొంగతనం చేసిన వ్యక్తులు అదే గ్రామంలో గ్రామంలో నివాసముంటున్న ఒక మహిళకు గ్యాస్ సిలిండర్ అమ్మినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎస్‌హెచ్‌ఓ రవికుమార్ వివరణ కోరగా.. అంగన్‌వాడీ కేంద్రంలో దొంగతనం జరిగిదంటూ ఫిర్యాదు వచ్చిందని, దీనిపై విచారణ చేపడుతున్నామని తెలిపారు.

రేపటి నుంచి సోషల్ ఆడిట్



మాట్లాడుతున్న జెడ్పీటీసీ తవుడు

గజపతినగరం రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై గ్రామాల్లో బుధవారం నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎస్ఆర్పీ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ సిబ్బందితో సోమ వారం సమన్వయ సమావేశం నిర్వహించారు. అతిథిగా హాజరైన జెడ్పీటీసీ గార తవుడు మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో ఆడిట్ పక్కాగా నిర్వహించాలని సూచిం చారు. ఆడిట్ బృందాలకు ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల సిబ్బంది పూర్తి సహకారం అందించాలని కోరారు. ఏపీఓ రామారావు, క్షేత్ర సహా యకులు, డీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మారు రథయాత్ర

విజయనగరం టౌన్: జగన్నాథుని రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం మారు రథయాత్ర ఘనంగా నిర్వహించారు. సంతపేట జగన్నాథుని రథాన్ని కన్యకపరమేశ్వరి ఆలయం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. అదేవిధంగా దాసన్నపేటలో కొలువైన స్వామివారికి మూడుకోవెళ్ల వద్ద, మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి, తరించారు.

ఇంగిలాపల్లిలో పారిశుద్ధ్య పనులు



కాలువులో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామంలో సర్పంచ్ గర్బాపు విజయలక్ష్మి సోమవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలోని అన్ని వీధి కాలువల్లో పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. చెత్తాచెదారాలను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించడంతో పాటు తాగనీటి బావులు, చేతి బోర్లలో క్లోరినేషన్ చేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



కందిపప్పును పరిశీలిస్తున్న మార్కెటింగ్ ఆఫీసర్ రవికిరణ్

విజయనగరం ఫోర్ట్: సరుకులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డిస్ట్రిక్ట్ అగ్రిటెడ్ మార్కెటింగ్ ఆఫీసర్ బి.రవికిరణ్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ రైతుబజార్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. అనంతరం కందిపప్పు, బియ్యం విక్రయిస్తున్న ప్రత్యేక కౌంటర్లను పరిశీలించి, సరుకుల నాణ్యతపై ఆరా తీశారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్



వేపాడ: కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రమాదేవి

కొత్తవలస: కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేసిన చట్టాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, క్రీడాసంస్థల ప్రతినిధులు, మండల అధికారులకు ఎంపీడీఓ రమణయ్య ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ప్రముఖ న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐపీసీ, సీఆర్పీసీల స్థానంలో భారతీయన్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య ఆదినియమ్(బీఎస్ఏ) చట్టాలను కేంద్రప్రభుత్వం ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. స్త్రీలు, చిన్న పిల్లలపై నేరాలకు పాల్ప డిన వారిని కఠినంగా శిక్షించేలా చట్టాలను మార్చా రని చెప్పారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు తప్పవన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నూతన చట్టాలపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులకు సూచించారు. అలాగే నూతన చట్టాల అమలుకు సంబంధించి మండల స్థాయిలో డీడీవోలు చైర్మన్‌గా, న్యాయవాది ,ఎన్జీవో సంఘాల ప్రతినిధులు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంఈఓ బి.శ్రీనివాసరావు, సీడీపీఓ ఆర్.ఉమాదేవి, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, వైద్యాధికారి గోపాలకృష్ణ, ఈఓపీఆర్డీ ధర్మారావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వేపాడలో...

వేపాడ: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన చట్టాలు, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సిబ్బందికి విజయనగరానికి చెందిన ట్రైనర్ కె.రమాదేవి సోమవారం అవగాహన కల్పించారు. భారతీయన్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య ఆదినియమ్(బీఎస్ఏ) చట్టాలతో పాటు, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారికి విధించే శిక్షలను వివరించారు. గ్రామాల్లో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలని, ఆడపిల్లలను చదివించు, ఆడపిల్లలను రక్షించు అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తహసీల్దార్ సత్యం, ఎంపీడీఓ నిర్మల, ఎంఈఓ బాలభాస్కరరావు, ఈఓపీఆర్డీ ఉమ, సీడీపీఓ కె.రమాబాయి, సూపర్ వైజర్ పరమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే వినతులను పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చొరవ చూపాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం సోమవారం నిర్వ హించారు. ప్రజల నుంచి ఎంపీడీఓతో పాటు పలుశాఖల అధికారులు వినతులు స్వీకరించారు. అనంతరం మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో తరచూ పారిశుద్ధ్య పనులు చేపట్టాల ని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేసి ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ డి.వెంకటరమణ, తదిత రులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు అవసరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి

గంట్యాడ: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే కమిటీలు ప్రతీ చోట ఉండాలని ఐసీడీఎస్ పీఓ ఉమా భారతి అన్నారు. మండల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పలు ప్రైవేటు సంస్థల ప్రతినిధులకు స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ హోమ్‌లు, బ్యాంకులు, పరిశ్రమలు, క్రీడా సంస్థలు, ఆస్పత్రులు, సహకార, సేవా, స్వయం ఉపాధుల సంస్థలు, విద్యాసంస్థలు, కార్పొరేషన్లలో పని చేసే మహిళలపై, ఇళ్లలో, ప్రయాణాల్లో మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారికి కొత్తగా తెచ్చిన లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం కఠిన శిక్ష తప్పదన్నారు. శారీరకంగా తాకడం, శారీరకంగా కలవాలని అభ్యర్థించడం, బలవంత పెట్టడం, శృంగార పరమైన చేష్టలు, సంభాషణలు, అసభ్యకర సైగలు లైంగిక వేధింపుల కిందికి వస్తాయని తెలిపారు. మహిళలతో మర్యాదగా నడుచుకోవాలని, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపీడీఓ భవాని, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి



పురిటిపెంటలో రాస్తారోకో చేస్తున్న జిల్లా ఐద్వా అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు



గజపతినగరంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గజపతినగరం: జిల్లాలోని రామభద్రపురం మండలం జీలికవలసలో గ్రామంలో పసిబాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు బోయన ఎరకన్నదొరను కఠినంగా శిక్షిం చాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షు రాలు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. పురిటిపెంట గ్రామంలో సోమవారం రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యసమా జం తలదించుకులా నెలల పసికందుపై అత్యాచారానికి పాల్పడిన మానవమృగానికి తర్వగా శిక్ష విధించాలని, నిందితుడికి న్యాయవాదులు సహకరించవద్దని కోరారు. ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ వేణి, సభ్యులు శారద,రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పసికందులపై లైంగికదాడి దారుణం

విజయనగరం జిల్లా రామబద్రపురం మండలంలోని ఆరునెలల పాపపై, నంద్యాలలో మూడేళ్ల పసిపాపపై లైంగిక దాడికి పాల్పడడం దారుణమని సీఐటీయూ నాయకుడు జి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక సచివాలయం వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.